


# అరవైగా మారిన ఇరవై

ఒకనాడు రేడియోలు కేవలం సంపన్నుల సొత్తుగా మాత్రమే ఉండేవి. ఈనాడు దారిప్రక్కన దుకాణంవాళ్లు, రిక్షావాళ్ళు కూడా వాటిని సొంతం చేసుకోగలుగుతున్నారు. నిన్నమొన్నటి వరకు టి.వి. కూడా సంపన్నులలో కూడా పైస్థాయి వారికే పరిమితమై ఉండేది. ఆ రోజుల్లో టి.వి. ఉన్న వారి తీవి వెలిగిపోతూ ఉండేది. ఈనాడు మధ్యతరగతి వర్గాలలో అట్టడుగువారు కూడా ఈ తీవిని ఒలకబోయగలుగుతున్నారు. పదిహేను ఇరవై సంవత్సరాల క్రితంవరకు మోటారు సైకిలు ఉన్నవారికి అదొక హోదా. మోపెడ్స్‌వచ్చాక అతి సామాన్యులు, కూడా శరవేగంతో ప్రయాణం చేయగలుగుతున్నారు. ఇదంతా అతిత్వరగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక విజ్ఞాన ఫలం.

ప్రపంచం 21వ శతాబ్దంలోకి దూసుకుపోయింది. అంతరిక్షయాత్రలు అతి సామాన్యం అయ్యాయి. అంతేకాదు. అంతరిక్ష నౌకలను సంపన్నులు సొంతంగా తయారు చేసుకుని గ్రహాంతరయానం చేయగలిగినంతగా సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందింది. 20వ శతాబ్దంలో ఎందరో ప్రైవేటు వ్యక్తులు విమానాలను సొంతం చేసుకోవడం విశేషం కానప్పుడు 21వ శతాబ్దంలో అంతరిక్ష నౌకలను సొంతంగా ఏర్పరచుకోగలగడంలో విడ్డూరం ఏముంది?

రజనీష్ కోటేశ్వరులకి ఏకైక సంతానం. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ తీసుకున్నాక స్పేస్ టెక్నాలజీలో స్పెషల్ కోర్సు చేశాడు. శనిగ్రహానికున్న అతి పెద్ద ఉపగ్రహం టైటాన్ మీద భూమిమీద ఉన్నట్లే వాతావరణం నీరు ఉన్నాయి. బహుశా అక్కడ ఏదో ఒక రూపంలో జీవం ఉండవచ్చునని శాస్త్రజ్ఞుల అనుమానం. ఆ టైటాన్‌మండలానికి యాత్రచేసి అక్కడి విశేషాలు తెలుసుకురావాలన్నది రజనీష్ ప్రగాఢ వాంఛ.

ఇండియాలో నేషనల్ స్పేస్ ఏజన్సీ (ఎన్.ఎస్.ఎ) అన్న సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ తన అధీనంలోని వివిధ కేంద్రాల నుంచి, రాకెట్లను, అంతరిక్ష నౌకలను పంపుతుంది. మనదేశం మొదట్లో ఆర్యభట ఉపగ్రహాన్ని తయారుచేసి రష్యాలోని కేంద్రం నుంచి అంతరిక్షంలోకి పంపినట్లు ఈ సంస్థ ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా ఏర్పరచుకున్న అంతరిక్ష నౌకలను, అంతరిక్షంలోకి పంపుతుంది. అందుకుగాను తగు మొత్తాన్ని ఫీగా వసూలుచేస్తుంది అంతరిక్ష నౌకల్ని తయారు చేయించుకోవడం ప్రయివేట్ వ్యక్తులకు సాధ్యమవుతుంది.



కాని అంతరిక్ష కేంద్రాల్ని నిర్మించుకోవడం సాధ్యం కాదుకదా! అందువల్ల ఎందరో ప్రైవేట్ వ్యక్తులు వారి కేంద్రాలనుంచి తమ అంతరిక్ష నౌకల్ని ప్రయోగింప జేసుకుంటుంటారు.

రజనీష్‌కి 20 ఏళ్ళు వచ్చేసరికి కోట్ల ఆస్తికి సొంతదారుడు అయ్యాడు. దాంతో టైటాన్ యాత్ర గురించి అతను కంటుండిన కలలకు వాస్తవరూపం వచ్చే అవకాశం ఏర్పడింది.

రజనీష్ తనకి కావలసిన అంతరిక్ష నౌకను తయారు చేయించుకున్నాడు. విశాఖపట్నం సమీపంలో ఎన్.ఎస్.ఎకి ఒక అంతరిక్ష ప్రయోగకేంద్రం ఉంది. అక్కడినుంచి 'టైటాన్'ని ప్రయోగించే ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. టైటాన్ మీదున్న అభిమానంకొద్దీ రజనీష్ తన అంతరిక్ష నౌకకి కూడా 'టైటాన్' అని పేరుపెట్టుకున్నాడు.

'టైటాన్ ఒక చిన్న అంతరిక్ష నౌక. దానిని స్టీల్, డ్యురాల్యూమినియం మిశ్రమలోహంతో తయారుచేశారు. అందులో ఆరడుగులు మేర నడవడానికి వీలైన ఇన్నర్ కాబిన్ ఉంది. దానిని అంటి ఆక్సిజన్ టాంకులు ఫుడ్ టాబ్లెట్స్, శక్తినిచ్చే ఔషధాల కాప్స్యూల్స్ వంటివి ఉంచిన గది ఉంది. శ్వాస తీసుకుని వదిలేసిన గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్ నుంచి తిరిగి ఆక్సిజన్‌ని విడగొట్టి సిలిండర్లలో నింపే యంత్రం ఉంది. దీనిమూలంగా కొద్దిపాటి ఆక్సిజన్‌తో ఎంతటి సుదీర్ఘ అంతరిక్షయానాలను అయినా సులువుగా చేయడం సాధ్యమవుతుంది. ఈ టైటాన్‌లో వున్న ఇతర విశేషాలు-దాని ప్రోగ్రాం అంతా ఆదినుంచి తుదివరకూ కంప్యూటరే నిర్వహిస్తుంది. దీనికి 20వ శతాబ్దంలోలాగా లిక్విడ్ హీలియం వంటి

వాటిని ఇంధనంగా ఉపయోగించి మూడు అంచెల రాకెట్‌ల వంటి ఏర్పాట్లు అవసరం లేదు. ఆటామిక్ ప్రొపల్షన్‌తో నడిచే ఈ అంతరిక్ష నౌక కావలసిన వేగాన్ని సంతరించుకుని సూటిగా రోదసిలోకి వెళ్లిపోగలదు. ప్రోగ్రాం ప్రకారం టైటాన్‌ని జేరడానికి పదేళ్లు, తిరిగి రావడానికి పదేళ్లు మొత్తం ఇరవై ఏళ్ళు పడుతుంది.

రజనీష్ అంతరిక్ష నౌకలోకి ప్రవేశించాడు. కొంచెం సేపట్లోనే దాని తలుపులు మూసుకున్నాయి. రజనీష్ అసిస్టెంట్ డాక్టర్ గుప్తా క్రిందనుంచుని ఈ కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకిస్తున్నాడు. కౌంట్‌డౌన్ ప్రారంభమయింది. పది, తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరు, ఐదు, నాలుగు, మూడు, రెండు, ఒకటి, జీరో- నౌకని విడుదల చేసే స్విచ్ ఆన్ అయింది.

* * * *

పెద్ద చప్పుడుతో ఏదో పగిలిపోయినట్లనిపించింది రజనీష్‌కి.

ముందున్న ఇండికేటర్‌కి ఉన్న అద్దం పగిలికింద పడి ముక్కలు ముక్కలయింది. దానిని ఆన్‌చేసి చూశాడు. అది పని చేయడం లేదు. నౌక వెళ్తున్న వేగం ప్రయాణించిన దూరం, దిశ, టైం ఇవన్నీ చూపించేది ఆ ఇండికేటరే. దీనికితోడు నౌకని ఎవరో కుదిపేస్తున్నట్లు కదిలిపోతోంది. ఇది చాలక డబ్బాలో రాళ్ళు పోసి గలగల ఆడించినట్లు ఒకటే చప్పుడు. నౌకకి ఏదో జరిగింది. క్షణాలలో ఎంతో ఎత్తుకి ఎగరగల దానికి ఏ విమానం కాని ఉల్కకాని అనుకోకుండా గ్రుద్దుకోలేదు కదా! లేకపోతే అణుఇంధనంలో ఏదైనా లోపం ఉండి తగిన వేగాన్ని పొందలేక భూమ్యాకర్షణ శక్తిని వదిలించుకునే ప్రయత్నంలో నౌక ఒకటే ఊగిపోవడం లేదు కదా! ఏమో! ఏం జరిగిందో తెలుసుకోవాలనుకున్నా ఏ యంత్రమూ పనిచేయడంలేదు. నౌకకున్న కిటికీలను తెరిచి అద్దాల తలుపులలో నుంచి బయటికి చూద్దామని ప్రయత్నించాడు రజనీష్. ఏ ఒక్క కిటికీకూడా ఎంత్ర ప్రయత్నంచేసినా తెరుచుకోలేదు.

అంటే మొత్తం మెకానిజమ్ పెద్దగా దెబ్బతిందన్న మాట.

అదృష్టవశాత్తూ నౌకలో ఎయిర్ కండిషనింగ్, లైటింగ్ మాత్రం దెబ్బతినలేదు. అసహనంగా కుర్చీలోంచి లేచి ఆరడుగులు ముందుకి నడిచాడు. రజనీష్. ఇంకా ముందుకి నడవాలన్నా వీలులేదు. అక్కడికి నౌక గోడ వచ్చేసింది. ఎదురుగా ట్రాన్స్‌పరెంట్ జార్స్‌లో ఫుడ్‌టాబ్లెట్స్, ఎనర్జైజింగ్ కెమికల్ పిల్స్ ఉన్నాయి. ఆ టాబ్లెట్స్‌లో ఉన్నది హైలీ కాన్‌సన్‌ట్రేటెడ్ అండ్ కండెన్స్‌డ్ ఫుడ్. ఆ టాబ్లెట్ ఒక్కటి చప్పరిస్తే చాలు. పూర్తి భోజనం చేసినట్లే లెక్క. ఎనర్జైజింగ్ కెమికల్ పిల్స్ వేసుకుంటే దాహం వెయ్యదు. ఒంటికి అవసరమైన శక్తీ వస్తుంది.

వాటి వంక అసహనంగా చూశాడు రజనీష్ అవి తనని జీవచ్ఛవంగా నిలపగలవు అంతే.

నౌకలోని యంత్రాలన్నీ చెడిపోవడంతో భూమితో టెలివిజన్ ద్వారాగానీ రేడియోద్వారా గానీ మరే విధమైన సంబంధంలేకుండా పోయింది.ఈ లెక్కన కంప్యూటర్ ప్రోగ్రాం మాత్రం కరెక్టుగా ఉంటుందన్న నమ్మకం ఏమిటి? సుడిగాలిలో కొట్టుకుపోతున్న కాగితంలా అయింది టైటాన్ పని. అసలు అది అంతరిక్షంలోకి దూసుకువెళ్ళి ప్రయాణంచేస్తోందో లేదో! చేస్తూనే ఉండాలి. ఏ కారణం చేతనైనా ప్రయోగం విఫలమైతే నౌక కూలిపోతే ఈ సరికి తాను అసలు బతికి ఉండేవాడే కాదు- అందులోనూ ఏ మాత్రం గాయాలు లేకుండా. నౌక అంతరిక్షంలో దూసుకుపోతుండగానే దానికి ఏదో అయి ఉండాలి. అందువల్ల

యంత్రాలన్నీ చెడిపోయినా భూమ్యాకర్షణ శక్తిని ఛేదించుకుని బయటపడ్డ కారణంగా, అది అలా కుదుపులతో ఓటి బండిలాగా సాగిపోతూ వుండాలి. ఈ లెక్కన తాను ఇప్పుడు అంతరిక్షంలో ఒక ఖైదీ. అది కూడా తాను నిర్మించుకున్న గదిలో. ఇలా ఎంతకాలం సాగుతుందో! కొన్ని నెలలు సంవత్సరాలు ఆ తర్వాత దారీ తెన్నూ లేని ఆ అనంత ప్రయాణంలో ఒంటరితనాన్ని తట్టుకోలేక తన ప్రాణం పోతుంది. ఆ శవాన్ని మోసుకుంటూ వెళ్ళి టైటాన్ ఏదో గ్రహాన్నో, ఉప గ్రహాన్నో, అల్ప గ్రహాన్నో, ఉల్కనో గ్రుద్దుకొని ముక్కలు ముక్కలై పోతుంది. ఆ శకలాలు కూడా అంతరిక్షంలో అనంతయాత్ర చేస్తుంటాయి.

ఆలోచనలతో పిచ్చెక్కిపోతోంది రజనీష్‌కి.

దానికి తోడు చెవులుతూట్లు పొడిచే ఈ రణగొణధ్వని. అది చాలక ఒళ్ళు హూనం చేసేకుదుపు.

ఒక తెలుగువాడు స్వరాష్ట్రంలో ఉన్నపుడు మరో తెలుగువాడిని పట్టించుకోడు. అదే ఏ నాగాలాండ్‌లోనో మిజోరంలోనో ఉన్నప్పుడు మరో తెలుగువాడు కనిపిస్తే ప్రాణంలేచి వస్తుంది. అదే ఏ అమెరికాలోనో, కెనడాలోనో, ఏ భారతీయుడు కనిపించినా పట్టరాని సంతోషం వేస్తుంది. ఇప్పుడు భూమిని వదిలి అంతరిక్షంలో ఉన్న రజనీష్‌కి మరో మానవమాత్రుడు కాదుగదా కనీసం పిల్లి, ఎలక ఆఖరికి ఈగా, దోమా కనిపించినా చాలనిపిస్తోంది. కాని ఎయిర్ టైట్ చేసిన ఆ టైటాన్‌లోకి ఈగా దోమలు కావు గదా కనీసం సూక్ష్మజీవులూ కూడా దూరలేవు. పైగా నౌకలోని గాలినికూడా ఏ రకమైన సూక్ష్మజీవులు, వైరస్‌లూ లేకుండా శుద్ధి చేశారు. లేకుంటే ఇతర గోళాల మీదకు వెళ్ళినప్పుడు అవి అక్కడ ఉత్పాతాలను సృష్టించగలవు. అందువల్ల ప్రస్తుతం టైటాన్‌లో ఉన్న జీవి కేవలం రజనీష్ ఒక్కడే.

ఆ ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాడు రజనీష్. ఈ ఏకాంత అనంతయాత్ర ఎంతకాలం! అసలు ఎంతకాలం గడిచిందో తెలిస్తేగా! కాలం అనేది సాపేక్షికం. సూర్యునిచుట్టూ భూమి తిరుగుతున్న దానిని బట్టి కాలం నిర్ణయించుకుంటున్నాం. కాని ఆ భూమినే వదిలేసినపుడు ఇంక కాలం ఎక్కడ ఉంది! దేనిని బట్టి దానిని కొలవాలి?

ఇంతకీ తన అంతరిక్ష నౌక పయనిస్తోందా లేదా? పయనిస్తూనే ఉండాలి. కాని ఆ విషయం లోపలకూచున్న తనకి తెలీదు. విమానంలో ప్రయాణం చేసేవారికీ అంతే. విమానంపైకి లేస్తున్నప్పుడూ కిందికి దిగుతున్నప్పుడు మాత్రమే అది కదులుతున్న విషయం తెలుస్తుంది. స్థిరంగా ఎగురుతున్నప్పుడు ఏ మాత్రం కదులుతున్నట్లపించదు. ఇంట్లో కూచున్నట్లే ఉంటుంది. అదే విధంగా తాను గుర్తించలేకపోయినా టైటాన్ కూడా ప్రయాణం చేస్తూనే ఉండాలి.

అసహనంగా అటూ,ఇటూ తిరగసాగాడు రజనీష్. ఉన్నట్లుండి ఎదురుగుండా మాసినగడ్డం, రేగినజుట్టు, ముడతలు పడ్తున్న ముఖంతో ఒక మానవాకారం కనిపించింది.

దానిని చూడగానే భయంతో గుండె ఎగిరివచ్చి గొంతులో పడ్డట్లయింది రజనీష్‌కి. విచిత్రం! అంతవరకూ ఈగా, దోమా అయినా చాలు అనుకున్న రజనీష్‌కి మనిషి కనిపిస్తే భయంతో ఒళ్ళు వణికిపోయింది. నిజమే. సూక్ష్మజీవులు కూడా జొరలేని అంతరిక్ష నౌకలోకి మానవాకారం వచ్చిందంటే భయంకాక మరేం వేస్తుంది!

అంతలోనే ఆ ఆకారం ఎవరిదో గుర్తుపట్టాడు రజనీష్. అది తనదే. అది ఎదురుగుండా వున్న

అద్దంలో కనిపించిన తన ప్రతిబింబం! దగ్గరగా వెళ్ళి చూశాడు రజనీష్. సందేహంలేదు. అది తన రూపమే. అరే! ఇదేమిటి! గడ్డం ఇంతగా మాసింది! జుట్టు ఎదిగిపోయింది. అరే! ముఖాన్న ముడతలు కూడా వచ్చాయే! అంటే తాను గుర్తించలేదు కాని అంతరిక్ష నౌక ఇంచుమించు కాంతి వేగానికి సమానమైన వేగంతో ఎన్నో సంవత్సరాలు ప్రయాణం చేసిందన్నమాట. కాలజ్ఞానం కోల్పోయిన తనకీ విషయం తెలియలేదు. అంతటి వేగంతో ప్రయాణం చేసేటప్పుడు దేహం పెరుగదల తగ్గిపోతుంది. అందుకనే గడ్డం, జుట్టూ మరీ ఎక్కువ పెరగలేదు. కాని ముఖంమీద ముడుతలు తనపెరిగిన వయసును చూపిస్తూ ఎన్నో సంవత్సరాలు గడిచిన వాస్తవాన్ని వెల్లడి చేస్తున్నాయి. అంతటి వేగంతో ప్రయాణించేటప్పుడు ఆకలి, నిద్ర వంటి జీవవ్యాపారాలు కూడా బాగా తగ్గిపోతాయి. అందుకే తనకి ఆకలీ వేయ్యలేదు. నిద్రా రాలేదు.

ఇంతకీ ఇప్పుడు తాను ఎక్కడ ఉన్నట్లు? ఏమో! అసలు సౌర మండలంలోనే ఉన్నాడా? దానిని దాటి ఇతర నక్షత్ర మండలాలవైపు దూసుకుపోతున్నాడా? ఏమో!, టైటాన్ కిటికీలు తెరవడానికి మళ్ళీ గట్టి ప్రయత్నంచేసాడు రజనీష్. కాని అవి తెరుచుకోలేదు. లాభం లేదు. ఈ శూన్యంలో దిక్కులేని చావు చావవలసిందే. మళ్ళీ మరోసారి అద్దంలో ముఖం చూసుకున్నాడు. గడ్డం, జుట్టూ ఇంకా ఎదిగినట్లు అనిపించింది.

సందేహం లేదు. టైటాన్ అమితవేగంతో అంతరిక్షంలో ప్రయాణం చేస్తోంది. తన వయసు పెరిగిపోతోంది అనిపించింది రజనీష్‌కి.

దిగులుగా వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. అంతవరకూ లేనిది అప్పుడు విపరీతమైన అలసట అనిపించింది. ఆలోచనలతో తలతిరిగిపోతోంది.

మొదటిసారిగా నిద్ర వచ్చేటట్లనిపించింది. కళ్ళు మూసుకుని నెమ్మదిగా నుదురు పట్టుకున్నాడు. సన్నకునుకుపట్టింది.

* * * *

ఎవరో తన టైటాన్‌ని బలంగా క్రిందికి లాగుతున్నట్లనిపించింది. విమానం నేలమీదకి దిగేటప్పుడు కలిగే అనుభూతి అది. ఉలిక్కిపడి లేచాడు రజనీష్.

సందేహంలేదు. టైటాన్ దేనిమీదికో దిగుతోంది.

కొంచెం సేపట్లోనే నేల తగిలినట్లు ఒక్క కుదుపువచ్చి నౌక ఆగిపోయింది. అంతవరకూ ఉన్న కుదుపూ, శబ్దం ఆగిపోయాయి.

నెమ్మదిగా టైటాన్ ద్వారం తెరుచుకుంది. నిచ్చెన బయటికి సాగింది. అంటే భూమి మీద రిమోట్‌కంట్రోల్ పనిచేస్తోందన్నమాట. లేదా సరిగ్గా సమయానికి అది బాగుపడి ఉండాలి. ఛల్లనిగాలి ఒంటికి తగలడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది. నెమ్మదిగా లేచివెళ్ళి నిచ్చెనమీది నించి క్రిందికి దిగాడు. నేలగట్టిగానే ఉంది. కాని ఎర్రని ఎరుపు. ఎటుచూసినా ఆ ఎరుపు అనంతంగా ఉంది. కొంచెం దూరంలో ఒక చెరువు కనిపిస్తోంది. దానిలోని నీరు కూడా ఎర్రగా ఆరంజి జ్యూస్‌లాగా ఉంది.

తలపైకెత్తి చూసాడు రజనీష్. మేఘాలు పల్చగా ఉన్నాయి. సూర్య బింబం చిన్నగా కనిపిస్తోంది. ఎండ తీక్షణంగా లేదు. సూర్యుని పరిమాణం బట్టి ఆ నేల ఎరుపు రంగుని బట్టి తన నౌక దిగింది

అంగారక గ్రహం అని గుర్తు పట్టాడు రజనీష్. తన నౌక చెడిపోవడంతో గ్రౌండ్ కంట్రోల్ వాళ్ళు తనని క్షేమంగా దారిలో అంగారక గ్రహం మీదికి దింపారన్నమాట. అయితే త్వరలోనే కమ్యూనికేషన్ సిస్టంగూడా బాగుపడవచ్చు.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది రజనీష్‌కి.

ఇంతలో ఎర్రని ఏడడుగులు ఎత్తున్న చెట్లు తనవైపు వస్తుండడం గమనించాడు. వాటిని అంతకుముందు దగ్గరలోవున్న చెరువు గట్టున చూశాడు. ఇప్పుడు అవి కదిలి వచ్చాయి. షేక్స్పియర్ రాసిన మాక్బెత్ నాటకం జ్ఞాపకానికి వచ్చింది. అందులో చెట్లు కదులుతూ వచ్చి చుట్టుముట్టాయి. భయంతో ఒళ్ళు బిగుసుకుపోయింది. తిరిగి నౌకలోకి వెళ్ళి పోవాలని ఎంత ప్రయత్నించినా భయంతో కాలు కదలలేదు. ఇంతలో ఒక చెట్టుబాగా దగ్గరికి వచ్చింది. రెండు కొమ్మలు సాచి రజనీష్‌ని దగ్గరకు లాక్కొంది. అతన్ని కాండానికి వేసి హత్తుకుని ఆ కొమ్మలతో బిగించి వేసింది. ఆ ఉక్కు కౌగిలినుంచి ఎంత ప్రయత్నించినా బయటపడలేక పోయాడు రజనీష్.

ఇంతలో ఆ కాండం పైభాగం వంగి రజనీష్ ముఖం దగ్గరకి వచ్చింది.

ఆశ్చర్యం! అందులో కళ్ళు, నోరు, ముక్కు అన్నీ ఉన్నాయి. అంటే ఇవి చెట్ల అకారంలో ఉన్న అంగారక గ్రహ జీవులన్నమాట. వాటి రక్తవర్ణం చూస్తేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. తన ముఖం మీదకి వంగింది ఒక స్త్రీ ముఖం అనిపిస్తోంది. ఆమె తనను ముద్దాడబోవడం లేదు కదా! వాంపైర్లు రక్తాన్ని త్రాగుతాయి అంటారు. ఈ ఎర్రని జీవాలు తన ఎర్రన్ని రక్తాన్ని త్రాగబోవడం లేదు కదా!

రజనీష్ చుట్టూ ఉక్కు కౌగిలి మరింత బిగిసింది. ఆ స్త్రీ నోరు అతని నోటి దగ్గరికి వచ్చేసింది.

భయంతో వెర్రికేక పెట్టాడు రజనీష్. దిబ్బుమని క్రింద పడడంతో మెలకువ వచ్చింది.

"అబ్బ...ఇదంతా కలా! ఎంత భయంకరమైన కల!" అంటూ కలయజూశాడు. నౌక ఎప్పటిలాగే వుంది, ఏ కిటికీ తెరుచుకోలేదు.

నెమ్మదిగా లేచి అద్దం ముందుకు వెళ్ళాడు రజనీష్.

తన రూపం చూసి తానే ఉలిక్కిపడ్డాడు.

ఇరవైయేళ్ళ తాను ఏబదేళ్ళ వాడిలాగా కనిపిస్తున్నాడు. గడ్డం బాగా పెరిగిపోయింది. జుట్టు భుజాలు దాటింది. సగానికిపైగా నెరిసింది కళ్ళు గుంటలైపోయాయి. దవడలు పీక్కుపోయాయి.

"అబ్బా...కనీసం ముప్పయి సంవత్సరాలు ప్రయాణం చేసి ఉంటాను. ఇంకా ఎన్నాళ్ళు ఈ అనంత యాత్ర!" అనుకుంటూ ఫుడ్ టాబ్లెట్స్, ఎనర్గయిజింగ్ పిల్స్ వేసుకుని మళ్ళీకుర్చీలో కూలబడ్డాడు రజనీష్.

* * * *

టైటాన్ శబ్దం ఆగింది. కుదుపూ లేదు. అది స్పష్టంగా దేనిమీదో దిగినట్లు తెలుస్తోంది. అయితే మాత్రం తానేంచేయగలడు. ఏ మెకానిజం పనిచేయని ఆ నౌకలో తాను బందీ.

బయట నుంచి ఎవరో నౌక తలుపుని వేటితోనో పగలకొట్టున్న శబ్దం వినిపిస్తోంది. మరికొంచెం

సేపట్లో తలుపు ఊడి కిందపడింది. లోపలికి రెండు పొడవాటి ఇనప చేతులు వచ్చాయి. ఆ రెండు చేతులూ రజనీష్‌ని పటకారుతో పట్టుకున్నట్లు పట్టుకుని బయటకు తీసికెళ్ళాయి, భయంతో అతను వేసిన కేక గొంతుదాటి బయటకు రాలేదు.

బయట ఎన్నో రోబోలు ఉన్నాయి, లోహంతో చేసిన గొట్టాలే వాటి కాళ్ళూ చేతులూ, టెలివిజన్‌వంటి ముఖం, ఎర్రని బల్బుల వంటికళ్ళు. అచ్చంగా మరమనుషులలాగానే ఉన్నా, చూడటానికి పరమ భయంకరంగా ఉన్నాయి అవి. నేలకూడా అంతా లోహమయం అనిపిస్తోంది. ఇళ్ళూ, చెట్లూ అన్నీ లోహమయమే.

ఆ మరమనిషి రజనీష్‌ని నెమ్మదిగా నేలమీదికి దింపాడు.

ఆ వింత జీవిని చూడడానికి ఉత్సాహంగా మిగిలిన రోబోలు వచ్చాయి. వాటిలో ఒక పొడవాటిది వాటికి నాయకుడు కాబోలు. అది దగ్గరికి రాగానే మిగిలినవి దూరంగా జరిగాయి.

"ఇది వింతజీవి. మెత్తని పదార్థంతో దీని దేహం తయారైంది. " అంటూ రజనీష్‌ని చూసి, ఆ నాయకునికి చెప్పాడు రజనీష్‌ని పట్టుకున్న రోబో.

"అలాగా అయితే ఈ రోజు మంచి విందు చేసుకుందాం" అంటూ రజనీష్‌కి దగ్గరగా రాబోయాడు ఆ నాయకరోబో

"వద్దూ...వద్దూ..." అంటూ గింజుకోసాగాడు రజనీష్. తలకి కుర్చీ కొట్టుకకోవడంతో మెలకువ వచ్చింది.

"అబ్బా... ఇదికూడా కలేనా! అంగారకుని మీద బుద్ధిజీవుల గురించి చిన్ననాడు ఊహించుకున్న ఊహల ప్రకారం ఆ కలవచ్చింది. నిత్యం రకరకాల రోబోలను చూడడంతో ఇప్పుడు ఈ కల వచ్చింది. అన్నీ భయంకరమైన కలలే" అనుకుంటూ తిరిగి అద్దం ముందుకు వెళ్ళాడు.

తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు రజనీష్.

తనకి అరవైయ్యేళ్ళు పై బడ్డ రూపం వచ్చేసింది. తలపూర్తిగా పండిపోయింది, గడ్డం మోచేయి దాటి పోయింది. బుగ్గలు దొక్కుపోయాయి.

"ఇదీ కలకాదు కదా!" అని ముందు అనుకున్నాడు. కాదని నిర్ధారణ చేసుకున్నాక-

"సందేహంలేదు. ఇప్పటికి ఎన్నో దశాబ్దాలు అంతరిక్షయానం చేస్తూనే ఉన్నాను. బహుశా ఈ పాటికి టైటాన్, సౌరమండలం దాటి ఇతర నక్షత్రమండలాలలోకి ప్రవేశించి ఉండవచ్చు కూడా" అనుకున్నాడు రజనీష్.

బయటినుంచి నౌక తలుపును బలవంతంగా తెరవడానికి ఎవరో ప్రయత్నం చేస్తున్న శబ్దం వినిపించింది.

"ఇది కూడా కొత్తకల" అని బాధగా నిట్టూర్చాడు రజనీష్. కాని అది కలకాదని అతనికి తెలియడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

నెమ్మదిగా లేచి వంగిపోయిన నడుముతో, వణుకుతున్న కాళ్ళతో తలుపు దగ్గరకు వెళ్ళాడు.

అంతలో తలుపు తెరుచుకుంది.

కళ్ళు మిరమిట్లు గొలిపే ప్రకాశం కనిపించింది.

సేదదీర్చే చల్లని సముద్రంగాలి వంటికి తగిలింది.

ఎదురుగుండా డాక్టర్ గుప్తా కనిపిస్తున్నాడు.

అతన్ని చూస్తూనే చేతులు సాచి నీరసంగా అతని చేతుల్లోకి వాలిపోయాడు.

"ఎవరు మీరు? రజనీష్ ఎక్కడ! అసలు మీరు ఈ నౌకలోకి ఎలా వెళ్ళారు?"అంటూ ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్‌గుప్తా.

"నేను..... నేనే రజనీష్‌ని" అన్నాడు హీనస్వరంతో.

"మీరా రజనీష్!" అంటూ ఆశ్చర్యంగా అతని వంక చూస్తూ, నెమ్మదిగా ప్రక్కన కూర్చోబెట్టి "మరి ఈ రూపం ఏమిటి?" అన్నాడు గుప్తా.

"ఇంచుమించు కాంతి వేగంతో సమానమైన వేగంతో, నాలుగైదు దశాబ్దాలు అంతరిక్షయానం చేస్తే ముసలితనం రాదా?"అన్నాడు రజనీష్.

"కాంతివేగం ఏమిటి? నాలుగైదు దశాబ్దాలు ఏమిటి? ఎవరు చేశారు ఆ ప్రయాణం?" అన్నాడు గుప్తా.

"ఇంకెవరు! నేనే" అన్నాడు రజనీష్ ఓపిక తెచ్చుకుంటూ.

"బాగుంది మీరు ఈ నౌకలో బిగుసుకుపోయింది కేవలం వారం రోజులు." అన్నాడు గుప్తా.

"అదేమిటి?" అన్నాడు రజనీష్ తనచెవులను నమ్మలేక.

"అవును, బ్లాస్ట్ ఆఫ్ టైంలో అటామిక్ ప్రొపల్షన్‌లో ఏదో లోటు వచ్చింది. అందువల్ల అది పైకి ఎగరలేదు. అటూ ఇటూ ఒకటే కదిలిపోసాగింది పెద్ద శబ్దంతో. దాని నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుండంతో నౌకని మేము అతికష్టం మీద అదుపుచేసి మీ దగ్గరకి రావటానికి మాకు వారం రోజులు పట్టింది" అన్నాడు గుప్తా.

"అయితే వారం రోజుల్లోనే ఇరవైయేళ్ళ నేను అరవయ్యేళ్ళ వాడినైపోయానా! ఇంక నా కలలన్నీ కల్లలే!" అంటూ మ్రాన్పడిపోయాడు. రజనీష్ ఆ షాక్ నుంచి తేరుకోకుండానే అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

దారుణమైన ఈ ట్రాజెడీకి చాలా బాధపడ్డాడు గుప్తా.

ఆ టైటాన్ నౌకలోనే రజనీష్ దేహాన్నుంచి సమాధి చేయించాడు.

"వారం రోజుల్లో ఇరవైయేళ్ళ యువకుడు అరవైయేళ్ళ తాతగా ఎలా మారాడు?" అని అనేకమంది వేసిన ప్రశ్నకు ఒకటే సమాధానం చెప్పాడు డాక్టర్ గుప్తా.

"మనసు చాలా విచిత్రమైంది. దానిలో కలిగిన తీవ్రమైన భావనల ప్రభావం దేహం మీద ఎంతగానో ఉంటుంది. సంకల్పబలంతో బలహీనులు కూడా ఎన్నో క్లిష్టకార్యాలు చేయగలరు. అంతరిక్ష నౌకలో

బిగిసిపోయిన రజనీష్ తన నౌక ఇంచుమించు కాంతికి సమానమైన వేగంతో సంవత్సరాల తరబడి ప్రయాణం చేస్తోందన్న బలమైన నమ్మకానికి లోనయ్యాడు. ఐన్‌స్టీన్ సూత్రం ప్రకారం ఇంచుమించు కాంతి వేగంతో సమానమైన వేగంతో ప్రయాణించేటప్పుడు జీవవ్యాపారాలు మందగించడం, శరీరం కుంచించుకుపోవడం జరుగుతాయి. ఈ సూత్రం తెలిసిన రజనీష్ అవన్నీ తనకి అన్వయించుకున్నాడు. అతని మనోభావాలు అంత తీవ్రంగా ఉండడంతో వాటి ప్రభావం అతని శరీరం మీద పడింది. దశాబ్దాలు గడుస్తున్నాయి కనుక తాను ముసలివాడు అవుతున్నట్లు భావించుకున్నాడు ఆయన. అంతే జరిగింది. యద్భావం, తద్భవతి అన్నట్లు బలీయమైన భావాలు ఉన్నప్పుడు అలాగ జరుగుతుంది. ఇది నా భావన మాత్రమే. ఈ విషయంలో ఎన్నో పరిశోధనలు జరిగితేనే కాని, మనసుకి దేహానికి ఉన్న సంబంధం స్పష్టంగా తెలీదు దీనికి కాలమే సమాధానం చెప్పాలి" అన్నాడు.

ఆంధ్రభూమి, ఆగస్టు 1987 ✪